పత్రికా ప్రకటన

తేదీ: 27-07-2020,

అమరావతి.

# ఏపీయే పారిశ్రామిక రంగానికి చేయూతలో ఫస్ట్..బెస్ట్

## పరిశ్రమలు, వాణిజ్య, ఐ.టీ, జౌళి, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి

అమరావతి, జులై, 27 ; పారిశ్రామిక రంగానికి చేయూతలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే ఫస్ట్..బెస్ట్ అని మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వెల్లడించారు. కోవిడ్ సంక్షోభమున్నా..అవకాశాలను సృష్టించడమే కాక..అభివృద్ధిని సాధిస్తామని మంత్రి మేకపాటి స్పష్టం చేశారు. "ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పురోగతి సాధన" కోసం టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు రోజుల వర్చువల్ సమావేశాలలో భాగంగా సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దార్శనిక నాయకత్వంలో అనుకున్నవన్నీ సాధిస్తామన్నారు. ప్రణాళిక, సమయపాలనలతో లక్ష్యాలను చేరుతామని గౌతమ్ రెడ్డి తెలిపారు.

### ఆర్థిక, పారిశ్రామిక, రాష్ట్రాభివృద్ధికి ఏకమవుదాం.. పునరంకితమవుదాం : మంత్రి మేకపాటి

పారిశ్రామిక వేత్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యదర్శుల ఆధ్వర్యంలో 'మేకింగ్ ఆంధ్రప్రదేశ్ ఫ్యూచర్ పాజిటివ్' థీమ్ తో సమాలోచనల సమావేశంలో మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మేకపాటి మాట్లాడుతూ.. కరోనా వల్ల ప్రపంచ ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమయిందన్నారు. దేశ వ్యాప్తంగా వాణిజ్య, పారిశ్రామిక రంగాలు నెమ్మదించాయని తెలిపారు. అయినా కూడా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను దేశంలోనే ముందు ఆదుకున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమని స్పష్టం చేశారు. ఏప్రిల్ 30వ తేదీన కరోనా ప్రభావంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను(ఎంఎస్ఎంఈ) ఆదుకోవటానికి రూ.1168 కోట్ల రీస్టార్ట్ ప్యాకేజీ ప్రకటించినట్లు వెల్లడించారు. జూన్ 30 కల్లా ప్రకటించిన ఆ మొత్తాన్ని 2 విడతలుగా చెల్లించామని తెలిపారు. మే, జూన్ నెలల్లో ఎంఎస్ఎమ్ఈలకు రూ.905 కోట్లు రాయితీ బకాయిలు అందజేశామని మేకపాటి పేర్కొనా . లాక్‌డౌన్ నేపథ్యంలో పరిశ్రమలకు వెసులుబాటు కోసం

విద్యుత్ స్థిర ఛార్జీలు రూ.188 కోట్లు మాఫీ చేసి ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు. మరో రూ.200 కోట్ల నిధితో సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు వడ్డీకి రుణాలు తీసుకునే వెసులుబాటు కల్పించడంతో ఎంతో ఊరట లభించిందన్నారు. ప్రభుత్వ విభాగాలకు అవసరమైన 360 రకాల వస్తువులు, ఇతర సామగ్రిలో 25 శాతం ఎంఎస్ఎంఈల నుంచి కొనుగోలు చేసి 45 రోజుల్లో బిల్లులు చెల్లించే మంచి నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

**పరిశ్రమలకు కార్మికుల కొరత లేకుండా చర్యలు : మంత్రి గౌతమ్ రెడ్డి**

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో పరిశ్రమలు మూతపడి, ఎంతో మంది ఉద్యోగాలు కోల్పోయి ఎన్నో కుటుంబాలపై ఆ ప్రభావం పడిందని మంత్రి మేకపాటి వ్యాఖ్యానించారు. కోవిడ్ కారణంగా అనేక మంది కార్మికులు సొంత ఊళ్ళకు చేరడంతో పరిశ్రమలలో పనులకు అంతరాయం ఏర్పడిందన్నారు. పరిశ్రమలను గాడిలో పెట్టేందుకు, ఆర్థిక రంగాన్ని పట్టాలెక్కించేందుకు ముందుగానే అప్రమత్తమై తగు చర్యలు తీసుకున్నామని మంత్రి వర్చువల్ మీటింగ్ లో వెల్లడించారు. సొంత ఊళ్లకు వచ్చిన మన రాష్ట్రంలోని గ్రామీణ స్థాయి కార్మికుల వివరాలపై అధ్యయనం ప్రారంభిస్తున్నట్లు మంత్రి వివరించారు. త్వరలోనే ఒక యాప్ ద్వారా పరిశ్రమలకు కావలసిన నైపుణ్యం, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న కార్మిక శక్తిని అంచనా వేసి ఉపాధి అందిస్తామని మంత్రి మేకపాటి స్పష్టం చేశారు. అవసరమైతే నైపుణ్య శిక్షణను అందించి ఎక్కువ మందికి ఉపాధి కొరతను తీర్చేందుకు ప్రణాళికతో ముందడుగు వేస్తున్నట్లు మంత్రి గౌతమ్ రెడ్డి పేర్కొన్నారు. కరోనా కారణంగా మార్చి, ఏప్రిల్ నెలలలో ఊహించని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా పడిందన్నారు. ముఖ్యంగా ఏపీలోనూ ఆర్థిక, పారిశ్రామిక రంగాలు వెనకబడ్డాయన్నారు. తాజాగా ప్రధాని మోదీ ప్రకటించిన 'ఆత్మనిర్భర్' తో ఉపశమనం లభించిందన్నారు. కీలక రంగాలను ఎంచుకుని, ఆర్థికంగా బలపడడానికి ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. ఉద్యోగం లేని వారి సంఖ్య..వారిలోని నైపుణ్యం ఏంటి, పరిశ్రమలలో వారిని వినియోగించుకోవడం ఎలా అన్న అంశాలపై త్వరలోనే సర్వే చేసి..సమస్యలన్నింటికి పరిష్కారం చూపుతామని అన్నారు. ఈ వర్చువల్ సమావేశానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ డిప్యూటీ ఛైర్మన్ పి.ఐ.హరనాథ్, రాష్ట్రీయ ఇస్పట్ నిగం లిమిటెడ్ ఛైర్మన్ ప్రదోశ్ కుమార్ రత్, ఏపీ విద్యుత్ శాఖ కార్యదర్శి శ్రీకాంత్ నాగులపల్లి, ఆంధ్రప్రదేశ్, సీఐఐ ఛైర్మన్ డి.రామకృష్ణ, శ్రీనివాస ఫామ్స్, ఇంటర్నేషనల్ ఎగ్ కమిషన్ ఎండీ సురేష్ చిట్టూరి తదితరులు హాజరయ్యారు.

*గమనిక : పత్రికా ప్రకటనకు సంబంధించిన ఫోటోలు, మంత్రిగారి వీడియో జతచేయడమైనది.*